క్లుప్తంగా

మద్యం షాపుల తనిఖీ

విశాఖ విద్య: గోపాలపట్నం, ఎన్ఏడీ ఏరియాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బలివాడ ఈశ్వరరావు శుక్రవారం తనిఖీ చేశారు. లైసెన్సు పొందిన వారు నిబంధనల మేరకు దుకాణాలు నిర్వహించాలని సూచించారు. జీవీఎంసీ పరిధిలో లైసెన్స్ పొందిన వారంతా గడువులోగా దుకాణాలు తెరవాల్సి ఉంటుందన్నారు.

ఈఎన్‌సీలో కొనసాగుతున్న స్వచ్ఛత స్పెషల్ డ్రైవ్



పరిసరాలు శుభ్రం చేస్తున్న నేవీ ఉద్యోగులు

సింధియా: తూర్పు నావికాదళంలో స్వచ్ఛతను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా స్వచ్ఛత స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. గాంధీ జయంతి పురస్కరించుకుని ఈ నెల 2న ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్‌ను ఈ నెలాఖరు వరకూ కొనసాగించనున్నారు. దీనిలో భాగంగా తూర్పు నావికాదళానికి చెందిన వివిధ విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వ్యర్థాలను పారవేయడం, స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, కార్యాలయాలు, పార్కులు, నివాసప్రాంతాల్లో శుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నారు. రికార్డుల నిర్వహణ, వాటి పర్యవేక్షణ, పర్యావరణాన్ని కలుషితం చేసే వాటి నియంత్రణ, పరిసరాలు పరిశుభ్రతకు కావాల్సిన వాటిపై ప్రత్యేక సందేశాన్ని అందించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నేవీ వర్గాలు తెలిపాయి. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తూర్పు నావికాదళ హెడ్ క్వార్టర్స్ పరిధిలోని యూనిట్లను శుభ్రపరచడంతో పాటు కాలం చెల్లిన వాహనాలు , ఇ-వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్‌కు అవార్డు



న్యూఢిల్లీలో అవార్డు స్వీకరిస్తున్న ఈశ్వరీ ప్రభాకర్

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరీ ప్రభాకర్‌కు ప్రతిష్టాత్మకమైన ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా స్కూల్ గ్రాండ్ జ్యూరీ అవార్డు 2024–25 వరించింది. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. డిజైన్ థింకింగ్ లీడర్‌గా ర్యాంక్ పొందినట్లు తెలిపారు. రోట్ లెర్నింగ్‌కు మించి ముందుకు సాగడం, విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచన, సహకారం, సమస్య పరిష్కారం తదితర నైపుణ్యాలను పెంపొందించే బోధన విధానాన్ని అమలు చేయడంలో అసాధారణమైన సామర్థ్యాన్ని గుర్తించి ఈ అవార్డుకు తనను ఎంపిక చేసినట్లు వివరించారు.

నేటి నుంచి దయాల్‌బాగ్ ఉత్పత్తుల ప్రదర్శన

ఆరిలోవ: దయాల్‌బాగ్ వస్తు ప్రదర్శన ఈ నెల 19 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఐ ఎపెక్ హెడ్ వి.ప్రేమ్ స్వరూప్ తెలిపారు. విశాలాక్షినగర్ డీఐసీ కేంద్రంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. డీఈఐ(దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్) సాత్‌జోన్ ఆధ్వర్యంలో ఉషోదయ కూడలి వద్ద గల ఉషోదయ ఫంక్షన్ హాలులో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. డీఈఐలో చేతి వృత్తుల్లో శిక్షణ పొందిన 52 మంది తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని, సుమారు రూ.12 లక్షలు విలువ చేసే ఉత్పత్తులను విక్రయానికి సిద్ధం చేసినట్లు వివరించారు. బ్లాక్ ప్రింటెడ్ చీరలు, దుప్పట్లు, బెడ్‌షీట్లు, దివాన్ సెట్లు, పిల్లో కవర్లు, జ్యూట్, కాటన్‌తో తయారు చేసిన బ్యాగులు, కుర్తాలు, పిల్లల దుస్తులు, తదితరవి ఇక్కడ అందుబాటులో ఉంటాయని, నగర వాసులు వినియోగించుకోవాలని కోరారు. విశాఖ డీఐఈ సెంటర్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ.. అవస్థల సవారీ!

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. అద్దె బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియదు. కూరగాయల బిల్లులు ఎప్పటికప్పుడు ఇవ్వరు. గ్యాస్ బండకిచ్చేదీ తక్కువే. చిన్నారులకు ఇచ్చే మెనూ చార్జీలు చాలీచాలనంతే. ఇక సిబ్బంది జీతాలు ఎప్పుడూ పెండింగే. అద్దె మొదలు మెనూ చార్జీల వరకు అన్నింటిపైనా ఎంతో కొంత ప్రతి నెలా అంగన్‌వాడీ కార్యకర్తలపై భారం పడుతోంది. ఫలితంగా అవస్థల సవారీ తప్పడం లేదని అంగన్‌వాడీలు నిట్టూరుస్తున్నారు.

- కేంద్రాల నిర్వహణకు సకాలంలో నిధులు ఇవ్వని ప్రభుత్వం
- అప్పులు చేసి నిర్వహణ
- అద్దె బకాయిలు నెలలు తరబడి పెండింగ్
- తాజాగా కరెంట్ కేటగిరీ–2 గా మార్పు
- కేంద్రాలను సర్వే చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది
- విద్యుత్ బిల్లుల భయంతో ఖాళీ చేయాలంటున్న యజమానులు



లక్ష్మీనగర్ ఈ-బ్లాక్ కేంద్రంలో సేద తీరుతున్న చిన్నారులు

విశాఖ విద్య: ఆరోగ్యవంతమైన పిల్లలను అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. అద్దె భవనాలు.. ఇరుకు గదుల్లో నడుస్తున్నాయి. ఫలితంగా లక్ష్యం నీరు గారే పరిస్థితి ఏర్పడింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో 3నుంచి 6 ఏళ్ల చిన్నారుల కోసం ప్రీ స్కూళ్లు నిర్వహిస్తున్నారు. వీరికి కేంద్రాల్లోనే మధ్యాహ్నం భోజనం వండిపెడుతున్నారు. మెనూ చార్జీల కింద ప్రభుత్వం చిన్నారికి రోజుకు రూపాయిన్నర ఇస్తోంది. కూరకు రూ.1. 25 పైసలు, తాలింపు గింజలకు 25 పైసలు చెల్లిస్తోంది. నూనె ఒక్కొక్కరికి 5 గ్రాముల చొప్పున ఇస్తున్నారు. 10 మంది పిల్లలుంటే 50 గ్రాములొస్తుంది. కంది పప్పు ఒక్కో చిన్నారికి 15 గ్రాములిస్తారు. అది ఎటూ చాలడం లేదని, అన్నీ లెక్కలేసుకుని వంట చేయాల్సిన పరిస్థితి ఉందని అంగన్ వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు పెరగడంతో మరింత భారమవుతుందని వారు వాపోతున్నారు.

గ్యాస్ కష్టాలు అదనం

గ్యాస్ వినియోగానికి గాను ప్రభుత్వం ఒక్కో చిన్నారికి 50 పైసలు ఇస్తోంది. గుడ్డు ఉడకబెట్టాలి. పాలు వేడి చేయాలి. అన్నం, రెండు రకాల కూరలు వండాలి. సరాసరిన ఒక గ్యాస్ బండ రెండు నెలలు వస్తుందని అంగన్‌వాడీలు చెబుతున్నారు. అంటే ప్రభుత్వమిచ్చేది రూ. 600లు. కానీ డెలివరీ చార్జీలతో కలిపి రూ.980 ఖర్చు పెడుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు చేసి పెడుతున్నారు.



అద్దె భవనంలో నిర్వహిస్తున్న 90వ వార్డులోని లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్ అంగన్‌వాడీ కేంద్రం

నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలు	60
సొంత భవనాలు ఉన్న కేంద్రాలు	06
అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాలు	14
రెంట్ ఫ్రీ భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాలు	40



లక్ష్మీనగర్, కొత్తపాలెం అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న భవనం

అద్దె భవనాలకు మోగనున్న విద్యుత్ బిల్లులు

నియోజకవర్గంలో 60 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో 14 చోట్ల అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు విద్యుత్ బిల్లు కేటగిరీ -1కింద ఉండగా దీన్ని ప్రస్తుతం కేటగిరీ–2కింద మార్పు చేసేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది సర్వే చేస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో అద్దె భవనాలకు విద్యుత్ బిల్లులు మోత మోగనుంది. భారీగా విద్యుత్ బిల్లులు వస్తే, తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పోతాయనే భయంతో కొంతమంది యజమానాలు కేంద్రాలను ఖాళీ చేయాలని కార్యకర్తలపై ఒత్తిడి తెస్తున్నారు.కేంద్రాల నిర్వహణను ఏమాత్రం పట్టించుకోక పోగా ఇప్పుడివేమి కష్టాలని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మొత్తం పరిణామాలు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను గాడితప్పేలా చేస్తున్నాయి.

ఏఐ, ఎంఎల్‌తో మెరుగైన ఉపాధి అవకాశాలు

విశాఖ సిటీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ ద్వారా భారీ వేతనాలతో కూడిన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పేర్కొన్నారు. ఏఐసీటీ–వైబ్రెంట్ అడ్వకసి ఫర్ అడ్వాన్స్‌మెంట్ అండ్ నర్చరింగ్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్(వాణి) సహకారంతో ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏఐ, ఎంఎల్, డీఎస్‌పై తెలుగులో చర్చా వేదికను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయాన మాట్లాడుతూ 2024 నాటికి వీటి అనువర్తనాలను 75 శాతానికి వినియోగిస్తారని తెలిపారు. ప్రజల్లో వీటి పట్ల విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. లక్షలాది నూతన ఉపాధి అవకాశాలను సృష్టించే శక్తి ఈ సాంకేతికతలకు ఉందని వివరించారు. దీనిని దృష్టిలో పెట్టుకొని దేశ, విదేశీ నిపుణులతో ఏయూ, అనుబంధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లలో ఏయూ కేంద్రీయ విద్యా సంస్థలైన ఐఐటీల కంటే మెరుగైన స్థానాన్ని సాధించిందన్నారు. సీఎస్ఈ విభాగం ఆచార్యుడు ఎం.శశి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి నూతన సాంకేతికతలను బోధించాల్సిన అవసరం ఉందన్నారు. మాతృ భాషలో అందరికీ చేరువ చేసే విధంగా కృషి జరపాలన్నారు. దీనికి నాందిగా ఈ కార్యక్రమం నిలుస్తుందన్నారు. ఐటీ విభాగాధిపతి ఆచార్య కుంజం నాగేశ్వరరావు మాట్లాడుతూ సాంకేతికతను స్థానిక భాషతో అనుసంధానించడంతో మెరుగైన అవగాహన కలుగుతుందన్నారు. సీఎస్ఈ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు , సదస్సు సహ సమన్వయకర్త ఆచార్య ఎం.రాంజీ, ఏయూ ఇంకుబేషన్ సెంటర్ సీఈఓ రవి ఈశ్వరపు, విజయ్, సునీల్ ఎస్.రంక తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



గోపాలపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్ వైజర్ జ్యోతి



అంబేడ్కర్ కాలనీ అంగన్‌వాడీకేంద్రంలో సూచనలు ఇస్తున్న ఏఎన్ఎం తార

విశాఖ విద్య: ఆరోగ్యమే మహాభాగ్యమని స్త్రీ శిశు సంక్షేమశాఖ సింహాచలం, మల్కాపురం సెక్టార్ల సూపర్‌వైజర్లు జ్యోతి, వరలక్ష్మి అన్నారు. సమాజహితం కోరుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్యపరమైన అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఐసీడీఎస్ సిబ్బందితో పాటు, వైద్య ఆరోగ్యశాఖ, సచివాలయ సిబ్బంది కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. మునగ, కరివేపాకు వల్లకలిగే ప్రయోజనాలు వివరిస్తూ వాటితో తయారు చేసిన పదార్థాలు,అదే విధంగా వాటి వస్తువులను అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రదర్శించారు. గోపాలపట్నం, 52వ వార్డు అంబేడ్కర్‌నగర్ కేంద్రాల్లో జరిగిన సదస్సుల్లో వారు మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే పలు రకాల ఆకు కూరలు ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని, వాటిని ఎక్కువగా తీసుకోవాలన్నారు.

ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి భరోసా కల్పిద్దాం

సీపీ శంఖబ్రత బాగ్చి పిలుపు



ట్రాన్స్‌జెండర్లు, మహిళలతో పోలీస్ కమిషనర్ బాగ్చి, రోటరీ క్లబ్ ప్రతినిధులు

మద్దిలపాలెం: ట్రాన్స్‌జెండర్లకు స్వయం ఉపాధి కల్పించడంలో దేశంలోనే విశాఖ ఆదర్శంగా నిలిచేలా కృషి చేద్దామని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. కోల్ ఇండియా సీఎస్సార్ నిధులు రూ.2.50 కోట్లతో ఆధునిక కుట్టు మిషన్లను మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు అందించడం అభినందనీయమన్నారు. పీతాపురంకాలనీలోని జన శిక్షణ సంస్థాన్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీపీ పాల్గొని.. 75 మందికి ఆధునిక కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ కుట్టు మిషన్లను ప్రతి మహిళా, ట్రాన్స్‌జెండర్లు సద్వినియోగం చేసుకుని.. ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. మహిళలు కుట్టిన వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని, ఇందుకు స్వచ్ఛంద సంస్థలు సహకరించాలన్నారు. విశాఖలో ట్రాన్స్‌జెండర్లకు సరైన ఉపాధి అవకాశాలు లేక ఇతర మార్గాల్లో పయనిస్తున్నారని.. దీని ద్వారా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. నగరంలోని ట్రాన్స్‌జెండర్లను గుర్తించి.. వారందరూ ఒకే మార్గంలో నడిచేలా ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాన్స్‌జెండర్లు కుట్టు శిక్షణ తీసుకోవడం అభినందనీయమని.. వీరిని మిగిలిన వారు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కుట్టు, క్లౌడ్ కిచెన్ రంగంలో శిక్షణ ఇవ్వడానికి తన వంతు కృషి చేస్తానని సీపీ అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలకు సమస్యలుంటే 79950 95799కు ఫోన్ చేయండి

మహిళలు వేధింపులకు గురైతే.. తన ఫోన్ నంబర్ 79950 95799కు ఫోన్ చేసి విషయం తెలియజేయాలని సీపీ శంఖబ్రత బాగ్చి సూచించారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధించిన తన దృష్టికి తీసుకురావాలన్నారు. నగరంలో ఉపాధి కోసం సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారు, ప్రైవేట్ సంస్థల్లో మహిళా ఉద్యోగులు ధైర్యంగా విధులు నిర్వర్తించాలని భరోసా కల్పించారు.

ఘనంగా హిందీ పక్షోత్సవాల ముగింపు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న రియల్ అడ్మిరల్ శంతనుఝా

సింధియా: తూర్పు నావికాదళ కేంద్రంలోని సాముద్రిక ఆడిటోరియంలో హిందీ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చీఫ్ ఆఫ్ స్టాఫ్ రియల్ అడ్మిరల్ శంతను ఝా ముఖ్య అతిథిగా పాల్గొని వార్షిక హిందీ మేగజైన్ పూర్వీ వాణి 30వ ఎడిషన్‌ను విడుదల చేశారు. అనంతరం తూర్పు నావికాదళంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న యూనిట్‌లు, వ్యక్తులకు రాజభాషా పురస్కారాన్ని ప్రదానం చేశారు. హిందీ ఫోర్ట్‌నైట్–24 సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ భాషను ప్రోత్సహిస్తున్న తూర్పు నావికాదళ సిబ్బందిని అభినందించారు. భవిష్యత్తులో హిందీ బాషా ప్రాముఖ్యతను వివరించేలా మరింత చురుగ్గా పని చేయాలని కోరారు. రోజువారీ అధికారిక పనిలో సరళమైన హిందీని ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నేవీ ఉన్నతాధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు తగదు



శ్రీహరిపురం సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



మల్కాపురం సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: రాష్ట్ర ప్రజలకు మేలు చేస్తామని ఎన్నికల్లో హామీలు ఇచ్చిన కూటమి నాయకులు అధికారం చేతికి రాగానే ఎప్పటిలాగా నమ్మిన ప్రజలను మోసం చేయడం మొదలు పెట్టారని సీపీఎం మల్కాపురం జోన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి అన్నారు.విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీహరిపురం, మల్కాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మణమూర్తి మాట్లాడుతూ విద్యుత్తు ఇంధన సర్దుబాటు, ట్రూ అప్ చార్జీల పేరిట వినియోగదారులపై భారాలు మోపడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే ఒక పైసా విద్యుత్ చార్జీ పెంచబోమని కపట వాగ్దానాలు చేసిన కూటమి నాయకులు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. అదనపు చార్జీల పేరిట రూ.8,114 వేల కోట్లు ప్రజలను నుంచి బిల్లుల రూపంలో లాగాలని చూడడం చాలా దుర్మార్గమన్నారు. జగన్ ప్రభుత్వాన్ని నాడు చంద్రబాబు బాదుడే బాదుడు అని హేలన చేసే వారని.. ఇప్పుడు అదే రీతిలో ప్రయాణిస్తున్నారని ఎద్దేవా చేశారు. పెంచిన విద్యుత్తు చార్జీలు తక్షణం తగ్గించాలని లేకుంటే ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్కాపురం విద్యుత్తు ఉప కేంద్రం వద్ద చేపట్టిన కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెంటారావు,పైడిరాజు కూటమి ప్రభుత్వ పాలనపై నిప్పులు చెరిగారు. సంక్షేమాన్ని పక్కన పెట్టి మద్యంపై పాలకులు మక్కువ చూపుతున్నారని ఆక్షేపించారు. నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్ని అంటినా పట్టించుకోవటం లేదని,ఇప్పుడు విద్యుత్తు చార్జీలు పెంచి సామాన్య మానవుడి నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు.సంపద సృష్టిస్తామని చెప్పిన చంద్రబాబు ఇలాంటి మార్గాలు అనుసరించి సంపద సృష్టిస్తారా అని వారు ప్రశ్నించారు.

'హిందీ భాషా సాహిత్యాలు'పై చర్చా గోష్టి

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగం, విశాఖ హిందీ పరిషత్, అవధి సాహిత్య సంస్థాల సంయుక్త ఆధ్వర్యంలో 'హిందీ భాషా సాహిత్యాలు–ఒక విమర్శ'అనే అంశంపై శుక్రవారం హిందీ భవన్‌లో చర్చా గోష్టి జరిగింది. కార్యక్రమాన్ని ఏయూ వీసీ శశిభూషణరావు ప్రారంభించి.. హిందీ భాష ప్రాశస్త్యాన్ని వివరించారు. హిందీని నేర్చుకోవాల్సిన ఆవశ్యకతను విశదీకరించారు. విశాఖ హిందీ పరిషత్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.ఎం.ఇక్బాల్ సుల్తాన్పూర్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో హిందీని అధ్యయనం చేసిన విద్యార్థులు, విద్వాంసులకు తగిన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హిందీ అధ్యాపకులను కేంద్ర ప్రభుత్వమే నియమించి, వారి జీతభత్యాలను చెల్లించే వ్యవస్థ రావాలని అభిప్రాయపడ్డారు. హిందీ విభాగం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.నరసింహారావు సభకు అధ్యక్షత వహించగా పూర్వ హిందీ విభాగ అధ్యక్షుడు పద్మభూషణ్ అవార్డు గ్రహీత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, నార్వే నుంచి ప్రొఫెసర్ సతీష్‌చంద్ర శుక్ల, యూపీకి చెందిన డాక్టర్ హరినాథ్ శుక్ల, భోపాల్‌కు చెందిన డాక్టర్ ప్రయాస్ జోషి తదితరులు పాల్గొన్నారు.

'సమ్మె విరమించుకోండి'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెను విరమించుకోవాలని ఉక్కు యాజమాన్యం ప్రతినిధులు కార్మిక సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 28న సమ్మె చేయనున్నట్టు ఈనెల 14న యాజమాన్యానికి ఎన్‌డీఏ కూటమి, కూటమేతర కార్మిక సంఘాలు తరపున సమ్మె నోటీసు అందజేశారు. ఈ నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) కాన్ఫరెన్స్ హాలులో సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్, సీజీఎం (హెచ్ఆర్) జి. గాంధీ శుక్రవారం నాయకులతో సమావేశమయ్యారు. ఆలోచించి నిర్ణయం ప్రకటిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

వీధిలైట్ల నిర్వహణ గాలికి..

- ఒక దగ్గర నిరంతర వెలుగు
- మరికొన్ని చోట్ల నెలల తరబడి అంధకారం



సింధియా సమీపంలో పట్టపగలే వెలుగుతున్న వీధిలైటు



సింధియా నుంచి మల్కాపురం ప్రధాన రహదారిలో అలముకున్న అంధకారం

సింధియా: జీవీఎంసీ అధికారుల పనితీరు ప్రజలకు విసుగు తెప్పిస్తోంది. వీధిదీపాల నిర్వహణలో అంతులేని నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇందుకు మల్కాపురం నుంచి సింధియా వరకు ఉన్న ప్రధాన రహదారిపై గాడి తప్పిన వీధి దీపాల నిర్వహణే నిదర్శనం. షిప్‌యార్డ్ నుంచి హెచ్‌పీసీఎల్‌కు భారీ యంత్రాలు తరలించే ప్రక్రియలో మల్కాపురం నుంచి సింధియా వరకు ఉన్న వీధి దీపాలను, రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌తో సహా తొలగించారు. దీంతో చీకటి పడితే ఈ మార్గంలో ప్రయాణమంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. వీధి దీపాలు వెలగక చీకట్లో ప్రయాణించడంతో అనేక రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఒక వైపు రాత్రిళ్లు వీధి లైట్లు వెలగక వాహన చోదకులు నానా తంటాలు పడుతుంటే, మరో వైపు పట్టపగలు దీపాలు వెలుగుతూనే ఉన్నా సంబంధిత అధికారులు వాటిపై దృష్టి సారించడంలేదు. సమస్యలపై జీవీఎంసీ, విద్యుత్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదనే అరోపణలు వినిపిస్తున్నాయి. మరో వైపు రహదారుల్లో అంధకారం అలముకోవడంతో ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయి. మందుబాబులు చిందులు వేస్తున్నారు. దీంతో చీకటి పడిన తర్వాత ఆ మార్గంలో ప్రయాణమంటే మహిళలు హడలి పోతున్నారు.

ఆకతాయిల బెడద



మల్కాపురం నుంచి సింధియా వరకు ఉన్న రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయి. రాత్రిళ్లు మద్యం సీసాలతో విద్యుత్ దీపాలను పగలుగొడుతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులుకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. అధికారులు స్పందించి వీధిలైట్లు సమస్యను పరిష్కరించాలి. ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్టు వేయాలి.

–దాసరి రవి, మల్కాపురం

రాత్రిళ్లు ప్రయాణించలేకపోతున్నాం



ప్రధాన రహదారిలో సాయంత్రం 6 గంటలు దాటితే ప్రయాణించలేకపోతున్నాం. ఈ ప్రాంతంలో వీధి లైట్లు వెలగక అంధకారం అలుముకుంటుంది. దీనికి తోడు ఈ రోడ్డులో ఆకతాయిల ఆగడాలు రోజురోజుకూ శ్రుతిమించుతున్నాయి. వీధి దీపాలు వెలిగేలా అధికారులు చర్యలు చేపట్టడంతో పాటు పోలీసులు ఆకతాయిలను నిలువరించే చర్యలు తీసుకోవాలి.

–కొట్నాన రవి, చింతల్లోవ

ఫిర్యాదు చేసినా..



కొన్ని రోజులుగా వీధి లైట్లు వెలగక నానా ఇబ్బందులు పడుతున్నాం. మరో వైపు సింధియా రోడ్డులో పట్టపగలు దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. సమస్యపై విద్యుత్ అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. జీవీఎంసీ విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

–నక్కా సూర్యనారాయణ, దుర్గానగర్